నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 22 అక్టోబర్ 2024 | KHAMMAM

గతంలో ఎన్నడూలేని విధంగా ఖమ్మం జిల్లాను ఈసారి వరదలు ముంచెత్తడంతో బాధితులు విలవిల్లాడారు. ప్రకృతి ప్రకోపానికి ప్రజలు బలై 50 రోజులు గడిచిపోయాయి. అయితే వారిని ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బాధితులకు ఇప్పటివరకూ పరిహారం అందించకుండా తాత్సారం చేస్తున్నది. దీంతో వారు మరింత కుంగిపోతున్నారు. వరదల కారణంగా భారీగా నష్టపోయిన రైతన్నలు పంట నష్టపరిహారం కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. అటు ప్రకృతి ప్రకోపం.. ఇటు సర్కారు నిర్లక్ష్యం కారణంగా మరింత కుదేలవుతున్నారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే వరద ఇళ్లలోకి రావడంతో కట్టుబట్టలతో బయటికొచ్చిన బాధితుల దుస్థితి మరింత దయనీయంగా మారింది. వారికి సర్కారు అందిస్తానన్న సాయం రూ.16,500 సైతం అందకపోవడంతో అధికారులకు అర్జీల మీద అర్జీలు పెట్టుకుంటున్నారు.

- ఖమ్మం, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

పరిహాసంగా మారిన పంట నష్టపరిహారం
తూతూమంత్రంగా వరద బాధితులకు సాయం
కాలయాపనతో నెట్టుకొస్తున్న కాంగ్రెస్ సర్కార్
అటు ప్రకృతి ప్రకోపం.. ఇటు సర్కారు నిర్లక్ష్యం..
కడు దయనీయంగా అన్నదాతల పరిస్థితి

ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలో ఇటీవలి వరదలకు కొట్టుకుపోయి పంటను చూపిస్తున్న రైతు బ్రహ్మయ్య (ఫైల్)

ఎన్నాళ్లో ఎదురుచూపులు!

గత ఆగస్టు 31న కురిసిన భారీ వర్షానికి వరదలు ముంచెత్తడంతో ఖమ్మం జిల్లా అతలాకుతలమైంది. కొద్దిరోజులకే సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర బృంద సభ్యులు వరుస పర్యటనలు చేసి ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అయితే నష్టం జరిగి రెండు నెలలు కావొస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. జిల్లాలో 27 వేల మంది రైతు కుటుంబాలకు పంట నష్టపరిహారం ఇవ్వకుండా రాష్ట్ర సర్కారు కాలయాపన చేస్తున్నది. ఇసుక మేటలు వేయడంతో ఇప్పట్లో తిరిగి సాగు చేసుకునే అవకాశం సైతం లేకుండాపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నగరంతోపాటు ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో వేలాది కుటుంబాలు వరదలకు బాధితులుగా మిగిలారు. కేటగిరీల వారీగా విభజించి తూతూమంత్రంగా కొద్దిమందికి మాత్రమే రూ.16,500 చొప్పున అకౌంట్లో వేయడంతో వేయికళ్లతో ఎదురుచూడడం మిగిలినవారి వంతయింది.

పరిహాసంగా పరిహారం..

జిల్లాలోని ఆకేరు, మున్నేరు వాగులు పొంగి ప్రవహించడంతో వరదలకు పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. వాగుల సమీపంలోని పంట పొలాల్లో పెద్దఎత్తున ఇసుక మేటలు వేసింది. జిల్లావ్యాప్తంగా 27,242 మంది రైతులకు సంబంధించి 28,407 ఎకరాల్లో పంట పూర్తిగా నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేశారు. ఇందుకు గాను ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.28.40 కోట్ల పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు బాధిత రైతులకు అణా పైసా పంటనష్ట పరిహారం అందలేదు.

ఖమ్మం జిల్లాలో..
దెబ్బతిన్న పొలాలు: 28,407 ఎకరాలు
నష్టపోయిన రైతులు: 27,242
సర్కారు ప్రకటించిన పరిహారం: రూ.28.40 కోట్లు

సర్వేలు.. కొర్రీలు..

మున్నేరు వరద బాధితుల తీరు మరోలా ఉంది. అనేకసార్లు సర్వే చేసిన అధికారులు వడపోత కార్యక్రమం చేపట్టి సగానికి సగమే అర్హులుగా తేల్చారు. సదరు లబ్ధిదారుల అకౌంట్లలో కొద్దిమందికే రూ.16,500 జమ చేశారు. అయితే పూర్తిగా ఇండ్లు దెబ్బతిన్న కుటుంబాల వివరాలు సర్వేలో లేకపోవడం, టెక్నికల్ కారణంగా మరికొంతమందికి కోత పెట్టారు. వారంరోజులపాటు సర్వే చేసిన యంత్రాంగం చివరకు తుది జాబితాను ప్రభుత్వానికి అందజేసింది. అయితే ఈ సర్వేలో అనేక కొర్రీలు, పొరపచ్చాలు ఏర్పడడంతో అర్హులకు న్యాయం జరగలేదు. అసలైన బాధితుల్లో చాలామందిని కేటగిరీ-1, కేటగిరీ-2లో చేర్చారని వారు వాపోతున్నారు. కేవలం కేటగిరీ-3పైన ఉంటేనే నష్టపరిహారానికి అర్హులవుతారని కొందరు అధికారులు చెప్పినట్లు వరద బాధితులు చెబుతున్నారు. దీంతో జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ అనేకమంది ప్రభుత్వ సాయానికి దూరమయ్యారు. అయితే రెండోవిడతలో దరఖాస్తులు అందజేసే బాధితులకు సర్కారు సాయం అందుతుందా? లేదా? అనేది వేచి చూడాలి.

ఆరెకరాల పంట మాయమైంది

నా ఆరు ఎకరాల పంట వరదలకు తుడిచిపెట్టుకుపోయింది. రాత్రికి రాత్రే వరదల్లో కొట్టుకపోయింది. వరి పొలం చేతికి వచ్చే సమయంలో వరదలొచ్చాయి. మిర్చి తోటలు అప్పుడే వేశాం. ఆరు ఎకరాల సాగుకు దాదాపు రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేశారు.. కానీ నయా పైసా పరిహారం అందలేదు.

– తేజావత్ సంతు, రైతు, తీర్థాల, ఖమ్మంరూరల్

ఇప్పటివరకు అతీగతీ లేదు..

పొలాలను చూస్తే దుఃఖం వస్తున్నది. నా మూడెకరాల మిర్చితోట పూర్తిగా కొట్టుకపోయింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాను. తోట వేసిన కొద్దిరోజులకే వరదలు రావడంతో ఒక్క చెట్టూ మిగలలేదు. ప్రభుత్వం రైతుల బాధలను పట్టించుకోవడం లేదు. ఇస్తాననన్నా కనీసం రూ.10 వేలు ఇప్పటివరకు అతీగతీ లేదు. అదిగో వస్తాయి.. ఇదిగో వస్తాయి అంటున్నారు గానీ ఇవ్వడం లేదు. ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగించాలి.

– వడ్లానపు బ్రహ్మయ్య, రైతు, తీర్థాల, ఖమ్మంరూరల్

పది పైసలు కూడా రాలేదు..

పెదవాగు ప్రాజెక్టుకు గండిపడి నా మూడెకరాల పొలం ఇసుక మేటలు వేసింది. పంట పండించడానికి వీలు లేకుండా పోయింది. మంత్రులు, అధికారులు వచ్చారు.. చూశారు.. కానీ ఇంతవరకు పరిహారం అందలేదు. ఎకరానికి రూ.పది వేలు ఇస్తామన్నారు. పది పైసలు కూడా ఇవ్వలేదు. ఇసుక తొలగించడం చిన్నరైతులకు సాధ్యం కాదు. బీడు భూములుగా మారాయి.

– డేరంగుల కురేశ్, రైతు, గుమ్మడవల్లి, అశ్వారావుపేట

ప్రభుత్వం ఆదుకోవాలి

మోరంపల్లి బంజర గ్రామంలో మూడెకరాల వరి సాగుచేశాం. వరదలకు మొత్తం ఇసుక మేటలు వేసింది. పంట నష్టపరిహారం ఇస్తామని చెప్పారు. నెల రోజులు గడుస్తున్నా నేటికీ సాయం అందలేదు. అధికారులను అడిగితే నివేదిక ప్రభుత్వానికి పంపామని చెబుతున్నారు. అప్పులు తెచ్చి పంటకు పెట్టుబడి పెడితే నీటిపాలైంది. మమల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– లకావత్ శ్రీదేవి, రైతు, అంజనాపురం, బూర్గంపహాడ్

అప్పుడు రూ.15 వేలు ఇస్తామన్నారు.. ఇప్పుడు పైసా ఇవ్వబోమంటున్నారు..

- కాంగ్రెస్ ప్రభుత్వ మోసానికి ఇంతకుమించిన సాక్ష్యం ఇంకేమీలేదు..
- వానకాలం 'రైతుభరోసా' ఎగవేతపై రైతులు, బీఆర్ఎస్ నేతల ఆందోళన
- పలు మండలాల్లో ధర్నాలు, ప్రదర్శనలు, రాస్తారోకోలతో నిరసన

భద్రాచలంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అశ్వాపురం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం/ అశ్వాపురం/ బూర్గంపహాడ్/ దుమ్ముగూడెం, అక్టోబర్ 21: తాము అధికారంలోకి వస్తే ఇప్పుడున్న రూ.10 వేల రైతుబంధు స్థానంలో రూ.15 వేలు ఇస్తామంటూ కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక ఇప్పుడు మొత్తానికే పంటల పెట్టుబడి సాయాన్ని ఎగ్గొడుతున్నారని రైతులు, బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. నమ్మి ఓటు వేసిన అన్నదాతలందరినీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా వంచించిందని విమర్శించారు. దాని మోసానికి రైతుభరోసా ఎగవేతను మించిన సాక్ష్యం ఇంకేమీ లేదని స్పష్టం చేశారు. వానకాలం సీజన్ రైతుభరోసా సాయాన్ని ఇవ్వబోమంటూ ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై భద్రాచలం, అశ్వాపురం బూర్గంపహాడ్, దుమ్ముగూడెం మండలాల రైతుల భగ్గుమన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆయా మండలాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండలాల్లో ధర్నాలు, ప్రదర్శనలు, రాస్తారోకోలతో నిరసన వ్యక్తం చేశారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్లో ప్లకార్డులు చేబూని రాస్తారోకో చేశారు. అశ్వాపురంలో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, రైతులు మాట్లాడుతూ.. వానకాలం పంటల పెట్టుబడి సాయం అందించాల్సిందేనని, ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అలాగే, రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, వరికి రూ.500 బోనస్ చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. భద్రాచలంలో బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, పడిసిరి శ్రీనివాస్, బీరబోయిన వెంకటనరసమ్మ, రామకృష్ణ, కోలా రాజు, గుంజా ఏడుకొండలు, తూతిక ప్రకాశ్, సూరిబాబు, అశ్వాపురంలో కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, కంచుగట్ల వీరభద్రం, ఈదర సత్యనారాయణ, కొల్లు మల్లారెడ్డి, వెన్న అశోక్‌కుమార్, బూర్గంపహాడ్‌లో గోపిరెడ్డి రమణారెడ్డి, జక్కం సుబ్రహ్మణ్యం, సాదిక్‌పాషా, వలదాసు సాలయ్య, కొనకంచి శ్రీను, చల్లకోటి పూర్ణ, సూరం కృష్ణ, భూపెల్లి నర్సింహారావు, మేడగం శ్రీనివాస్‌రెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి, దుమ్ముగూడెంలో మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, కణితి రాముడు, జానీపాషా, తునికి కామేశ్వరరావు, అపకా వీర్రాజు, దామెర్ల శ్రీనివాస్, జోగా వెంకటరమణ, మోతుకూరి శ్రీకాంత్, అల్లాడి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపహాడ్: తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం: రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

ప్రజావాణిలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నేలపై కూర్చున్న వృద్ధుడి నుంచి తాను కూడా నేలపై కూర్చొని దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్

ఖమ్మం, అక్టోబర్ 21: ప్రజావాణి దరఖాస్తులను అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కల్లూరు మండలం పేరువంచకు చెందిన కె.దుర్గ వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. ఖమ్మం రామన్నపేట కాలనీవాసులు తమ ఇండ్లు పూర్తిగా వరదలో మునిగిపోయాయని, సర్వే పూర్తయినప్పటికీ ప్రభుత్వసాయం అందలేదని దరఖాస్తు చేసుకోగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అధికారులు రాజేశ్వరి, దీక్షా రైనా తదితరులు పాల్గొన్నారు.

తేమ, తూకం పేరుతో మోసం చేస్తే కఠిన చర్యలు

- **సీసీఐ కేంద్రం ప్రారంభంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్, అక్టోబర్ 21: తేమ, తూకాల పేరుతో దళారులు రైతులను మోసం చేస్తే కఠినచర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడుసమీపంలోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మార్కెటింగ్‌శాఖ రూపొందించిన పత్తి రైతు అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ తేమశాతం, నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. పంట పూర్తిగా ఆరబెట్టి తీసుకొస్తే ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో అర్థమయ్యే రీతిలో రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రైవేట్ మార్కెట్లో సైతం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ప్రస్తుత తరుణంలో పత్తి, మిర్చి ఇతర పంటల కంటే ఉద్యాన పంటల సాగు ఎంతో మేలన్నారు. సంప్రదాయ పంటల సాగుకు రైతులు స్వస్తి పలికి ఆయిల్‌పామ్ సాగుకు మందుకురావాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి ఏఎంసీ చైర్మన్ హరినాథబాబు, అధికారులు అలీం, పుల్లయ్య, సరిత, ఉమానగేశ్, ప్రవీణ్‌కుమార్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పండుగెళ్లి పదిరోజులయ్యాక చీరలా?

- అది కూడా ఎస్టీ మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకేనా?
- గతంలో కేసీఆర్ 12 వేల చీరలు పంపితే.. ఈ ప్రభుత్వంలో ఆరు వేల చీరలేనా?
- భద్రాద్రి జిల్లా చండ్రుగొండలో చీరల పంపిణీపై మహిళల మండిపాటు

చీరల పంపిణీ విషయంలో రావికంపాడు పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తుడు

చండ్రుగొండ, అక్టోబర్ 21: 'పండుగ వెళ్లిపోయిన పదిరోజులకు చీరలా?' అవి కూడా మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు, గిరిజన మహిళలకేనా? మేమంతా తెలంగాణ ఆడబిడ్డలం కాదా?' అంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మా మండలానికి 12 వేల చీరలను పంపిస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 6,098 చీరలే పంపిస్తుందా?' అంటూ ప్రశ్నించారు. 'తెలంగాణ ఆడపడుచులకు చీరల పంపిణీ' పేరిట ముద్రించిన కవర్‌లో పెట్టిన చీరలను తీసుకొచ్చిన ప్రభుత్వం.. వాటిల్లో ఎక్కడా బతుకమ్మ పేరును ప్రస్తావించలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చండ్రుగొండ మండలం రావికంపాడు, తిప్పనపల్లి పంచాయతీల కార్యాలయాల్లో ఆయా పంచాయతీల కార్యదర్శులు సోమవారం ఈ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అక్కడ కేవలం ఎస్‌హెచ్‌జీ సభ్యులకే పంపిణీ చేయడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కొందరు గ్రామ మహిళలు, గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. 'కేవలం ఎస్‌హెచ్‌జీల సభ్యులకే పంపిణీ చేయడమేంటి?' అంటూ రావికంపాడు పంచాయతీ సెక్రటరీపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ చీరల పంపిణీని కొద్దిసేపు నిలిపివేశారు. నిరసనకారులను పంపించివేశాక తిరిగి చీరల పంపిణీని కొనసాగించారు. ఇక తిప్పనపల్లిలో కూడా మహిళలు ఇలాగే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గుట్టుచప్పుడు కాకుండా చీరల పంపిణీ చేయడం ఏమిటి?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారికి పంచాయతీ సెక్రటరీ శివ సర్ది చెప్పి పంపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగకు ముందే మహిళలందరికీ చీరలు వచ్చేవని, ఆ చీరలు కట్టుకొని తాము బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకునే వాళ్లమని గుర్తుచేశారు.

గత కేసీఆర్ ప్రభుత్వం రూ.5 కోట్లిచ్చినా..
బ్రిడ్జి నిర్మాణంలో జాప్యమెందుకు?

వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తుల రాస్తారోకో

ములకలపల్లి, అక్టోబర్ 21: మండలంలోని రింగిరెడ్డిపల్లి – ములకలపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి గత కేసీఆర్ ప్రభుత్వం రూ.5 కోట్లిచ్చినా దాని నిర్మాణంలో ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోందని మండల వాసులు ఆరోపించారు. ఆ వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జూన్‌లో చేపట్టిన నిర్మాణ పనులు వానల కారణంగా ఆగిపోయాయని చెప్పారు. వానలు తగ్గినప్పటికీ పనులను కొనసాగించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పాత బ్రిడ్జి పక్కన అప్రోచ్ రోడ్డుగానీ, సరైన డైవర్షన్ రోడ్డుగానీ నిర్మించకపోవడంతో పరిసర ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో చేస్తున్న వారి వద్దకు ఆర్ఐ భద్రునాయక్ వచ్చి, బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

ములకలపల్లిలో రాస్తారోకో చేస్తున్న మండల ప్రజలు

శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

- **విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివి**
- **ఫ్లాగ్ డేలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు**

అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ, పోలీసు అధికారులు

కొత్తగూడెం క్లైం, అక్టోబర్ 21: శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యమని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు అమూల్యమైనవని అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం 'ఫ్లాగ్ డే'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ముఖ్యతిథులుగా హాజరయ్యారు. పరేడ్ కమాండర్ లాల్ బాబు ఆధ్వర్యంలో సాయుధ దళ పోలీసుల నుంచి కలెక్టర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమని అన్నారు. శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పే క్రమంలో ఎంతో పోలీసులు మంది పోరాడి అమరులయ్యారని, వారి త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లడుతూ.. 1959లో చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిన రోజు ఇదేనని, ఈ క్రమంలో శత్రు సైన్యంతో పోరాడి పది మంది అసువులు బాసినందున వారిని స్మరించుకుంటూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. అదనపు ఎస్పీ సాయి మనోహర్, డీఎస్పీలు చంద్రబాను, రెహమాన్, మల్లయ్యస్వామి, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.